క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 11న రాజీవ్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్ 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజీవ్‌నగర్, రాసాలమ్మకాలనీ, మాతృశ్రీ లేఅవుట్, దువ్వాడ స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని నాయుడు తెలిపారు. ప్రజలు అసౌకర్యానికి గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే పల్లా శ్రీను

గాజువాక: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.2.36 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్, స్థానిక నాయకులు సంద్రాన నూకరాజు, వరదాడ చిట్టిబాబు, నేలపాటి శ్యాంబాబు, సత్యవతి, గొంతిన శ్రీనివాస్, ఈటి శ్రీను, అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వానరం హల్ చల్



అగనంపూడి: దువ్వాడ కాలనీలో వానరం ఇళ్లల్లోకి, మేడల మీద హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వానరాన్ని పట్టుకొని జూకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభిరామ్



బి.వి.పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్, కౌన్సిలర్, ఇంద్రజాలికుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి సంఘ సేవకుడు భరణికాన రామారావు, సీనియర్ మెజిషియన్ కె.విజయ్‌కుమార్, బాలవికాస్ ఫౌండేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు, గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి కె.వి.ఎస్.మూర్తి, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరావు తదితరులు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పట్టాభిరామ్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను మిగిలిన వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా భరణికాన రామారావు మాట్లాడుతూ పట్టాభిరామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తనదైన రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందారన్నారు.

చూడ'చెక్కిన' శిల్పాలు

శిలలకు అద్భుత రూపాలు తెస్తున్న తండ్రీకొడుకులు



సాధారణ మేస్త్రిలుగా జీవనం ఆరంభించారు. శిల్పులుగా కీర్తిగడించారు. దేవతలు,దేవుళ్ల రూపాలను మన కళ్ల ముందు ప్రత్యక్షమయ్యేలా తీర్చిదిద్దుతారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో కార్మికులుగా జీవితాన్ని ఆరంభించిన తండ్రీకొడుకులు శిల్పాలు చెక్కే పనిపై దృష్టి పెట్టి గొప్ప కళాకారులుగా గుర్తింపు సాధించారు. ఏ శాస్త్రం అభ్యసించకుండానే తమ స్వశక్తితో ఎన్నో దేవాలయాలను నిర్మించి ప్రజల మన్ననలను చూరగొంటున్నారు. వారే తూర్పు గోదావరి జిల్లాకు చెందిన తండ్రీ కొడుకులు గేదెల వెంకటేశ్వరరావు, మణికంఠ.

– కూర్మన్నపాలెం

వదుల సంఖ్యలో దేవతామూర్తులకు జీవం

ఆలయాల, విగ్రహాలు తీర్చిదిద్దడంలో నేర్పరులు

60కి పైగా ఆలయాల నిర్మాణం



వారి ప్రతిభకు దైవ సంకల్పం తోడైంది. నిర్మాణ కార్మికులుగా వృత్తి ప్రారంభించిన వారు ఆలయాల నిర్మాణం.. దేవతల విగ్రహాల రూపకల్పనలో స్థిరపడ్డారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి ప్రాంతంలోనే 30కి పైగా దేవాలయాలు, అమ్మవార్లగుడులు కట్టి మంచి గుర్తింపు పొందారు. అలాగే చోడవరం ,విజయనగరం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో కూడా దేవాలయాలు నిర్మించి ఆ ప్రాంత వాసుల నుంచి కూడా మన్ననలు అందుకున్నారు. వడ్లపూడిలో వారి చేతుల మీదుగా నిర్మితమైన త్రిశక్తి ఆలయంలో వారు చెక్కిన దేవతామూర్తులు కళ్లముందు కదులాడుతున్నట్టు కన్పిస్తాయి. అందులో తండ్రీ కొడుకులు చెక్కిన అమ్మతల్లుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకొంటాయి. అలాగే గవర వీధిలో దుర్గమ్మ, సాయిబాబా ఆలయాలు కూడా అంతే చక్కగా నిర్మించారు. కాళింగ వీధిలో శివాలయం, రాసాలమ్మకాలనీలో పరదేశమ్మ ఆలయాలు భక్తులను పరవశింప చేస్తున్నాయి. ఇవేకాక





నరవ తదితర ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాలు.. అందుల్లో వేంచేసియున్న దేవతామూర్తులు సైతం చూపరులను కట్టిపడేస్తున్నాయి.

నిర్మాణంలో మరిన్ని ఆలయాలు

లంకెలపాలెంలో దుర్గాలమ్మ ఆలయం, కణితిలో శివాలయం వీరే నిర్మిస్తున్నారు. శివాలయం ముందు కాలభైరవస్వామి, నవగ్రహాలను చెక్కే పనిలో నిమగ్నమై ఉన్నారు. వారు 20 ఏళ్లుగా వడ్లపూడి ప్రాంతంలోనే ఉంటూ దేవాలయాల నిర్మాణ పనిలో క్షణం తీరికలేకుండా ముందుకు సాగుతున్నారు.





ఏ ఆలయమైనా వారు ఉండాల్సిందే

కూర్మన్నపాలెం, వడ్లపూడి లంకెలపాలెం ప్రాంతాల్లో ఏ ఆలయం నిర్మించాలన్నా ఆ తండ్రీకొడుకులు ఉండాల్సిందే. వారి ప్రతిభను చూసిన ఈ ప్రాంత వాసులు ఆలయ నిర్మాణ బాధ్యతలు వారికే అప్పగిస్తున్నారు.

ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 60కి పైగా దేవాలయాలు నిర్మించామని వారు చెబుతున్నారు. తాము పుట్టిన ఊరు కంటే ఇక్కడే తమకు ఎక్కువమందితో పరిచయాలు ఉన్నాయని తండ్రీకొడుకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహాల తయారీ ఇలా

విగ్రహాలు చెక్కడానికి ముందుగా సిమెంట్, రాడ్డు సహాయంతో బొమ్మను పోలుస్తారు. ఆ తర్వాత బిర్లా సిమెంట్‌తో రూపకల్పన చేసి దేవుడి ఆకారం తీసుకొస్తారు. ఆ తర్వాత నగసిగలు దిద్ది వారు అనుకున్న రూపంలో విగ్రహాన్ని తీర్చిదిద్దుతారు. ఇందుకోసం ముందుగా డిజైన్ తయారు చేసి వారు అనుకున్న భగవంతుడు లేదా దేవతామూర్తికి సరిపోలితే ఫైనలైజ్ చేస్తారు. ఆ తర్వాత మిగతా పనులు పూర్తి చేసి ఆలయంలో అమరుస్తారు. ఆలయ విస్తీర్ణం, అక్కడ పరిస్థితులకు అనువుగా ఎన్ని విగ్రహాలు.. వాటి సైజు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని నిర్మాణానికి శ్రీకారం చుడతారు. ఇలా అన్ని హంగులు సమకుర్చుకుంటూ విగ్రహాలతో పాటు ఒక ఆలయ నిర్మాణానికి సుమారు ఏడాదిన్నర పడుతుందని వారు చెబుతున్నారు.



ఆధ్యాత్మిక భావంతో నిర్మాణాలు



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత శిల్పిగా మారాను. మేము రూపొందించిన విగ్రహాలు, ఆలయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. తాము డబ్బు కోసం చూడం. దేవుడు రూపాన్ని ఎక్కడా తేడా రాకుండా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. ఆలయాల నిర్మాణం, శిల్పాలు చెక్కడం ఖర్చుతో కూడిన పని.అందు వల్ల ఒక్కోసారి పనులు సకాలంలో పూర్తికావు. అయినా మేము ఈ వృత్తిలోనే స్థిరపడ్డాం. దేవుడు మాకు తోడుగా ఉన్నాడు.

– గేదెల మణికంఠ, శిల్పి

పురస్కార గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీత పరమేశ్వరిని సత్కరిస్తున్న ప్రముఖ చిత్రకారుడు దానయ్య

ఉక్కునగరం: స్థానిక కల్పన ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన దాచేపల్లి పరమేశ్వరికి జాతీయ స్థాయి బాల ప్రోత్సాహక పురస్కారం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని మామిడివాడకు చెందిన పరమేశ్వరి ఎనిమిదేళ్లుగా కల్పన ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతోంది. ఇటీవల విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో జరిగిన 12వ జాతీయ చిల్డ్రన్ అండ్ యూత్ ఎగ్జిబిషన్‌లో పరమేశ్వరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆమె ప్రతిభ చూపడంతో బాల ప్రోత్సాహ పురస్కారంతో పాటు వి.వి. భగీరథ అవార్డు, సర్టిఫికెట్, బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కల్పన ఫైన్ ఆర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు డి. దానయ్య పరమేశ్వరిని సత్కరించారు.

భక్తులకు క్లాత్, జ్యూట్ బ్యాగుల పంపిణీ



భక్తులకు జూట్, క్లాత్ బ్యాగ్‌లు అందిస్తున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సింహాచలేశుడి గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా క్లాత్, జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో పారాయణ సేవా సమితి ప్రతినిధులు దారిపొడువునా భక్తులకు పంచారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, సాయి సేవకులు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతి థామంలో సాయినాథుని రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్, సాయి సేవకులు ఆధ్వర్యంలో రథంపై బాబా ఉత్సవ మూర్తిని ఉంచి ఊరేగించారు. సమతానగర్, వుడా కాలనీ, వెంపల్లనగర్, కొత్త కర్ణవానిపాలెం, నడుపూరు మీదుగా రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాజువాకలో సమ్మె ప్రశాంతం



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



బీహెచ్‌ఈఎల్‌లో ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటంలో భాగంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె గాజువాకలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సీఐటీయూ గాజువాక జోన్ ఆధ్వర్యంలో బుధవారం పాతగాజువాక నుంచి కొత్త గాజువాక వరకు, అక్కడ్నుంచి పాతగాజువాక వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మాలన్న ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పని గంటలను పెంచే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎం.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, ఎ.నూకేశ్వరరావు, గొలగాని అప్పారావు, డి.రమణ, బంగారు నాయుడు, నక్క నాగరాజు, నమ్మి రమణ, కిరీటం, కె.వి.రమణ, మీనాక్షి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ కిటకిట



కన్సల్టెంట్స్ గదుల వద్ద రోగులు



ఓపీ వద్ద రోగుల రద్దీ..

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రోగులతో కిటకటలాడుతోంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల బారినపడుతున్న వారు విమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొద్ది రోజులుగా జ్వరాల బారిన పడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా ఓపీ సుమారు 800 దాటుతోంది. జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ బాధితులు నమోదవుతున్నారు. సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నవారు ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్, కార్డియాలజీ, ఈఎన్‌టీ తదితర వాటితో పాటు జ్వరాలతో వచ్చే రోగులతో రోజూ ఓపీ అధికంగా నమోదవుతోంది. జ్వరాలతో వెళ్లేవారికి రక్త పరీక్షలు నిర్వహించడంతో వారిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు సోకినట్లు వెల్లడవుతోంది. అలాంటివారు విమ్స్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. రోజూ విమ్స్‌కు వస్తున్నవారిలో 15 శాతంపైగా జ్వరాల బారిన పడినవారే ఉంటున్నారు.

పరిశోధనలతో దేశ అభివృద్ధి



ప్రసంగిస్తున్న ఆచార్య బీవీ మురళీధర్

మద్దిలపాలెం : దేశ అభివృద్ధికి సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలు ఎంతో దోహదపడతాయని ఆచార్య బి.వి.మురళీధర్ అన్నారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో బుధవారం బహుళ విభాగాల పరిశోధనలో వినూత్న దిశలు అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మురళీధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వాలు ఇలాంటి పరిశోధనలు జరిపించాలని సూచించారు. వీటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సామాజిక శాస్త్రంతోపాటు అన్ని రంగాల్లో పరిశోధనలు జరిగితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం హక్కులు హరించేందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాల ప్రైవేటీకరణ ఉపసంహరించాలన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, పి.వి. రమణమూర్తి, యు. రామస్వామి, బి. శ్రీనివాసరాజు, డి.వి. రమణ, సురేష్‌బాబు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు అధ్యక్షుడు మద్దాల అప్పారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.. ఈ సందర్భంగా తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కేవలం రెండు, మూడు హామీలు అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తుచేశారు. ప్రతి గడపకు వెళ్లి బాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.

అనంతరం రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్‌కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నాగిశెట్టి శ్రీనివాసరావు, 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, ఇరోతి గణేష్, ముంగునాయుడు, అర్జున్, పప్పుల పుష్ప, కొనతాల మళ్లేష్, సూరిబాబు, దల్లి బాబులరెడ్డి, పిట్ట అప్పలరెడ్డి, జానా సతీష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె సంపత్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్(ఎన్ఎఫ్ఐఆర్) జనరల్ సెక్రటరీ ఎం.రాఘవయ్య పిలుపు మేరకు ధర్నా చేసినట్లు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా, అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో మెమోరండం సమర్పించినట్లు చెప్పారు. శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రైల్వేల్లో ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను ఆపాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వెంటనే ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నటు తెలిపారు. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్మన్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం ద్వారా మెమోరాండం సమర్పిస్తున్నటు చెప్పారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్‌కు మెమోరండం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆయా బ్రాంచ్‌ల సెక్రటరీలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవిద్య ఉపాసన కోర్సు



శ్రీవిద్య ఉపాసనలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో 7 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవిద్య ఉపాసన అడ్వాన్స్‌డ్ కోర్సు బుధవారంతో ముగిసింది. దేశంలోని ముంబై, పూణే, హైదరాబాద్, ఢిల్లీ వంటి ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ, డెన్మార్క్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 24 మంది అభ్యాసకులు ఈ కోర్సులో శిక్షణ పొందారు. కోర్సులో భాగంగా దశ మహా విద్యలు, నవావరణ అర్చనలు, హోమ విధానాలు నేర్చుకున్నారని గురుమాత అన్నపూర్ణమ్మ వెల్లడించారు. గురుమాతతో పాటు ఆచార్యులు మూర్తి రాధ, కందర్ప రమలకు అభ్యాసకులు కృతజ్ఞతలు తెలిపారు.